# వ్యాపకం

-దూరి వెంకటరావు

"ఏమండోయ్ మిమ్మల్నే" స్వరం రెట్టించింది అలివేణి.

పరధ్యానంగా వున్న మూర్తి 'ఊ' అన్నాడు ఉలిక్కి పడుతూ.

"ఇవాల్టినుండి మహిళా మండలి వారోత్సవాలు. వచ్చేసరికి బాగా పొద్దుపోవచ్చు. ఫ్లాస్కులో పాలున్నాయి. ఫిల్టరులో డికాషనుంది. కావాలనిపిస్తే కాఫీ కలుపుకు తాగండి."

"ఎందుకైనా మంచిది చీకటి పడితే చూస్తూ ఊరుకోకుండా ఓ పావు బియ్యం కుక్కర్లో పడేయండి" అంటూ భుజానికి బ్యాగు తగిలించుకుంది అలివేణి.

ఏదో అనబోయాడు మూర్తి.

అప్పటికే అలివేణి చెప్పుల్లో కాళ్ళు దూర్చేసింది.

ఉస్సూరుమంటూ కుర్చీలో వెనక్కి జారగిలబడ్డాడు. భార్య అనే ఆ ఒక్క వ్యక్తి కూడ బయటకు జారుకోవడంతో ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం అలుముకుంది. మళ్ళీ దయ్యాలు తనని వెక్కిరించడం మొదలు పెట్టాయి.

నిమిషాలు గంటల్లా గడుస్తున్నాయి.

ఏం చేయాలో తోచక కుర్చీలో నుంచి లేచి తిన్నగా వీధి గుమ్మంలో కొచ్చాడు. విశ్వనాథం ఉన్నాడేమోనని పక్కింట్లోకి తొంగి చూశాడు. తన పిచ్చిగాని ఈ వేళప్పుడు వాడు ఇంట్లో ఎందుకుంటాడు? తనలా అతడు పనీపాటు లేనివాడేం కాదు.

'టంగ్ టంగ్' అంటూ రెండు గంటలు కొట్టి మళ్ళీ గంట వరకు పలకరించేది లేదంది గోడ గడియారం.

మూర్తి రైల్వేలో స్టేషన్ మాస్టరుగా పనిచేసేవాడు. అతడికి ఒక్కగానొక్క కొడుకు. కంప్యూటర్‌లో ఏదో కోర్సు పూర్తిచేసి స్టేట్స్ వెళ్ళిపోయాడు. ఆడపిల్లలు అసల్లేరు. ఇంకా సంపాదించి ఎవరికి పెట్టాలనుకుని ముందే వాలంటరీ తీసేసుకున్నాడు. వచ్చిన డబ్బులు బ్యాంకులో వేసుకుని శేష జీవితం ప్రశాంతంగా గడుపుదామనుకున్న మూర్తికి తనెంత పొరపాటు చేశానా అని ఇప్పుడనిపిస్తోంది. తొందరపడి నిర్ణయాలు తీసుకుంటే ఆనక తీరిగ్గా బాధపడవలసి వస్తుందన్న ఎవరో మహాకవి మాటలు గుర్తొచ్చాయి. అంతా అయిపోయాక ఇప్పుడు ఏమనుకుని ఏం లాభం? సర్వీసు పదేళ్ళు ఉందనగా పిల్లవాడి చదువు కోసం కుటుంబాన్ని స్వస్థలానికి పంపేశాడు. ఒంటరిగా ఉండటం వల్ల డ్యూటీ ఉన్నా లేకున్నా రోజంతా స్టేషన్లోనే గడిపేవాడు. వచ్చే పోయే ట్రైన్స్‌ని, పాసింజర్లని చూస్తూ వుంటే టైము తెలిసేది కాదు. ఖాళీ సమయాల్లో టిటిసిలు గుమస్తాలు వచ్చి కబుర్లు చెప్పేవారు. ఫలితంగా కాలం సునాయాసంగా గడచిపోయేది. గ్యాంగ్‌మెన్‌లో ఒకడు రెండు పూటలా తనకు వండి పెట్టేవాడు. చిటికేస్తే చాలు పోర్టరు క్యాంటీన్‌కెళ్ళి చాయ్ పట్టుకొచ్చేవాడు. తోటి ఉద్యోగులు తనతో ఎంతో ఆత్మీయంగా మెలగడంతో ఒంటరిగా ఉంటున్నా లోన్లీనెస్ ఫీల్ కాలేదు.

ఇహ అలివేణి విషయానికొస్తే పెనిమిటి దగ్గర లేకపోవడం, ఉన్న ఒక్క కొడుకు ఉద్యోగాన్వేషణలో అటు ఇటు తిరుగుతూ ఉండటం మూలాన్న ఆమెకేమీ తోచి చచ్చేది కాదు. వ్యాపకం కోసం మహిళా మండలిలో సభ్యురాలిగా చేరింది. దరిమిలా వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అనతికాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది. హైటెక్ మహిళలతో పరిచయాలు

## రాత్రి కల

రాత్రికల-
చిలకో గోరింకో ఏవో రెండు వచ్చి
చెట్టుమీద బొప్పాయి పండు కోసిమ్మని
నన్ను చెట్టుపైకి లాక్కుపోయాయి
నా దగ్గర చాకులేదు
మీరే కొరుక్కు తినండి అన్నాను.
అయితే నువ్వొద్దుపో అని నన్ను కసిరి
చూస్తుండగానే
మెత్తని పండంతా మొత్తం తినేసి
విత్తనాలు కింద పారేశాయి.
రాత్రంతా నాకు చెట్టుమీదుండి
బొప్పాయిలు తిన్నట్టు కల-
పొద్దున్నే లేచి చూశాను
చెట్టు కింద విత్తనాలు అప్పుడే
కొన్ని మొలకెత్తాయి
అచ్చం పక్షిముక్కుల్లాగే
వంకర తిరిగి వున్నాయి మొలకలు
చూడాలి మరి-
అందులో చిలక ముక్కులేవో
గోరింక ముక్కులేవో!

-భూషి కృష్ణదాసు

పెరగడంతో వాళ్ళిచ్చే విందులు వినోదాలకు హాజరు కావలసి వచ్చేది. దాంతో ఆమెకు రోజుకు ఇరవై నాలుగు గంటలు చాలేవి కావు.

ప్రస్తుతం భర్త పదవీ విరమణ చేసి చెంతనే ఉన్నా పాత బంధాల్ని త్రెంచుకోలేకపోతోంది. మగడి సన్నిధిలో ఎక్కువసేపు గడపాలని ఎన్నోమార్లు అనుకుంది. అయితే బాధ్యతలు నెత్తిన వేసుకోవడం వల్ల మహిళా మండలికి దూరం కాలేకపోతోంది. ఫలితంగా మూర్తి ఏకాకిగా గడపవలసిన పరిస్థితి ఏర్పడింది.

"ఇవాళ మన పెళ్లి రోజు. నువ్వు ఎక్కడికి వెళ్ళొద్దు. సాయంత్రం అలా బయటకెళదాం. మనిద్దరం కలిసి పిక్చర్ చూసి ఎన్నేళ్ళైందో!" అన్నాడు అభ్యర్థనగా.

"మనకు ఐదు పదులు ఎప్పుడో దాటిపోయాయి. ఇంకా మ్యారేజ్‌డే లేమిటండి. ఎవరైనా వింటే నవ్విపోతారు. అయినా నేనీ రోజు ఇంట్లో ఉండిపోతే ఎన్ని పనులు నిలిచిపోతాయో మీకేం తెలుసు?" అన్నది అలివేణి. తను చేస్తున్న పనిలో నిబద్ధత తప్ప భర్తను అలక్ష్యం చేస్తున్నానన్న భావనకు తావు లేదు.

"నువ్వు చేసేది ఉద్యోగం కాదు కదా. ఊడిపోతుందేమోనని బెదిరిపోవడానికి. నా మాట విని ఈ ఒక్క రోజు ప్లీజ్" నచ్చజెప్పబోయాడు మూర్తి.

"మీరన్నట్టు నేను చేస్తున్నది ఉద్యోగమే అయితే ఎప్పుడో రాజీనామా చేసి ఉండేదాన్ని. ప్రజోపయోగమైన పనులు చేసేటప్పుడు మీ వంతు సహకారాన్ని అందివ్వాలే తప్ప ఆటంకాలు సృష్టించకూడదు. ఇవాళ భూకంప బాధితుల కోసం విరాళాలు ప్రోగుచేసే కార్యక్రమం ఉంది" అంది అలివేణి.

"గత వారమే కదా ఏవో విరాళాలు వసూలు చేసుకొచ్చానన్నావ్. మళ్ళీ ఇప్పుడిదేమిటి?" సందేహం వెలిబుచ్చాడు మూర్తి.

"అవి తుఫాను బాధితుల కోసం వసూలు చేసిన చందాలు. మీకివేం అర్థం కావు లెండి. మనిషికి ఏదో ఒక వ్యాపకం ఉండాలంటారు. మీకే పని లేకపోవడం వల్లే అస్తమాను నన్ను ఇంట్లో ఉండిపోమంటున్నారు. చేస్తానంటే చెప్పండి మా మహిళా మండలి అధ్యక్షురాలితో చెప్పి మీకేదైనా ప్రైవేటు స్కూల్లో టీచరుగా వేయిస్తాను"

అలివేణి మాటలకు విస్తుపోయాడు మూర్తి. ఇంత బ్రతుకు బ్రతికి ఇంటి వెనక చచ్చినట్లు ఉన్నతమైన ఉద్యోగం విడిచిపెట్టేసింది ఇందుకా? అనిపించింది. అంతే, అప్పటి నుంచి భార్యని ఇంట్లో ఉండమని ఒత్తిడి చేయడం మానేశాడు.

ఆటో దిగి మహిళా మండలి అధ్యక్షురాలు మహలక్ష్మమ్మగారి ఇంటి గుమ్మం ఎక్కింది అలివేణి.

వీధి తలుపులు వారగా వేసున్నాయి.

కాలింగ్ బెల్ నొక్కింది.

సమాధానం లేదు.

లోపల ఎవరో మూలుగుతున్నట్లనిపించడంతో దభాలున తలుపు తోసింది.

మహలక్ష్మమ్మగారి భర్త నారాయణరావు గుండె పట్టుకుని బాధతో విలవిలలాడి పోతున్నాడు.

ఇంట్లో మహలక్ష్మమ్మ ఉన్నట్లు లేదు. ఏం చేయాలో పాలుపోక భుజాన ఉన్న వాటర్ బాటిలు తెరిచి అతడి చేత మంచినీళ్ళు త్రాగించింది. ఫలితం కానరాక పోవడంతో సెల్ తీసి మహలక్ష్మమ్మ గారుండే ఆఫీసుకి, హాస్పిటల్‌కి ఫోన్ చేసింది.

పెనిమిటికి గుండెజబ్బు ఉందని తెలిసి కూడ అతడిని ఒంటరిగా ఎలా విడిచిపెట్టేసిందా అనిపించింది. సమయానికి తను ఉండబట్టి సరిపోయింది. లేకుంటే అతడి గతేమిటి? – ఇలా ఆలోచిస్తుండగా అంబులెన్సు వచ్చింది. ఆ వెనకే మహలక్ష్మమ్మ ఆటోలో దిగింది. అలివేణి చేసిన ఉపకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భర్తతోపాటు తనూ అంబులెన్సు ఎక్కింది.

వ్యాను వెళ్ళిపోవడంతోనే అలివేణి ఆలోచనలు ఊపందుకున్నాయి. సందు దొరికిందని సులువుగా మహలక్ష్మమ్మను తప్పుపట్టిందిగాని నిజానికి తను చేస్తుందేమిటి? భర్త బాగోగుల్ని గాలికొదిలేసి జనోద్ధరణకు బయలుదేరలేదా? జీవిత చరమ దశలో తనతో కలిసి ప్రశాంతంగా కాలం గడుపుదామన్న ఆరాటంతో ఉద్యోగం వదులుకుని వచ్చిన పెనిమిటికి తనేమిచ్చింది? ఓ ఆలంబనా? ఆత్మీయతా? ఇన్నాళ్ళూ క్లబ్ కార్యక్రమాల్లో పాల్గొన్నదంటే అర్థముంది. అప్పుడది అనివార్యం. కేవలం వ్యాపకం కోసం చేసింది. మరి నేడు?... ఇప్పటికే తను జీవితంలో ఎంతో పోగొట్టుకుంది. ఐదేళ్ళు భర్తకు దూరంగా ఉండి భయంకరమైన ఒంటరితనాన్ని అనుభవించింది. ఎడబాటు వల్ల ఎన్నో మధుర క్షణాలు మట్టిలో కలిసిపోయాయి. పోయింది తిరిగిరాదు. వచ్చిన అవకాశాన్ని వదులుకోవడమన్నంత మూర్ఖత్వం మరొకటుండదు. 'ఇంట గెలిచి..' అన్న సామెతేదో స్ఫురణకు రావడంతో మగడిని మెప్పించేందుకు గభాలున ఇంటి ముఖం పట్టింది అలివేణి. ■